సాక్షి మంచిర్యాల

గురువారం । 23 । జనవరి । 2025



పక్షుల లెక్క పక్కా

కవ్వాల్ టైగర్‌జోన్‌లో పక్షుల సర్వే నిర్వహించనున్నారు. ఈ నెల 24నుంచి మూడు రోజుల పాటు ఏడు బృందాల్లోని 28మంది సభ్యులు సర్వే నిర్వహిస్తారు. 8లో▸



మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ కిశోర్‌చంద్ర తెలిపారు. జన్నారం మండలం పొనకల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /16.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, బుద్దిపల్లి, పడ్తనపల్లి, నంనూర్, నర్సింగాపూర్, లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతాయని, దరఖాస్తుల పరిశీలన అనంతరం నిరుపేదలకు లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయభరోసా పథకాలపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీఓ ఉమర్‌షరీఫ్, లక్సెట్టిపేట ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న అనిత

చెన్నూర్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి అనిత అన్నారు. అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. రిజిష్టర్లు తనిఖీ చేశారు. ప్రతీరోజు వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడే సేవలు అందించాలని అన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వైద్యులు కృష్ణతేజ, స్పందన, సబ్ యూనిట్ అధికారి జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని చూసి నేర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా సైన్స్ అధికారి

నెన్నెల: ప్రకృతిని చూసి మానవుడు నేర్చుకోవాలని, మనుగడ కోసం పోరాటమే మానవ ప్రగతికి సోపానమని జిల్లా సైన్స్ అధికారి మధుబాబు అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిజ్ఞాస మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా ఆవుడం ఉన్నత పాఠశాలలో వివిధ రకాల సైన్స్ కృత్యాలపై కార్యాశాల నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బెర్నోలి సూత్రాలు, తరంగాలు, ధ్వని ఎలా ప్రసరిస్తుంది, ఇనుప మొలలపై కూర్చోవడం, కరెంట్ బల్బులపై నిల్చోవడం, అరచేతిలో కొబ్బరి కాయ పట్టుకొని భూమిలోపల ఉన్న నీటి జాడ చెప్పడం వంటి కిటుకులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల భాగస్వామ్యంతో 30కిపైగా చేసిన సైన్స్ కృత్యాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మీ, జిజ్ఞాస మొబైల్ సైన్స్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లి ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఫ్యాకల్టీ లేక విద్యార్థులకు సరైన బోధన జరగడం లేదని, ప్రైవేట్ అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌సీవో హామీ ఇచ్చారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సాగర్, సబ్బని రాజేంద్రప్రసాద్, క్రాంతికుమార్, మురళీ, శ్రావణ్ పాల్గొన్నారు.



భీమారంలో జరిగిన గ్రామసభలో నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

అర్జీల వెల్లువ

- గ్రామ, వార్డు సభల్లో వేలాదిగా దరఖాస్తులు
- కొన్ని చోట్ల అధికారులతో వాగ్వాదాలు
- సంక్షేమ పథకాల కోసం తప్పని తిప్పలు
- రేపటితో పూర్తికానున్న ప్రజాపాలన సభలు

మొత్తం గ్రామ పంచాయతీలు	311
నిర్వహించిన గ్రామ సభలు	273
కొత్తగా వచ్చిన అర్జీలు	40వేలు
మొత్తం మున్సిపల్ వార్డులు	155
నిర్వహించిన వార్డు సభలు	111
కొత్తగా వచ్చిన అర్జీలు	9341

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం జిల్లా ప్రజల నుంచి అర్జీలు వేలాదిగా వెల్లువెత్తుతున్నాయి. గత రెండ్రోజులుగా జిల్లాలో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా అర్హుల జాబితాను ఆయా గ్రామాలు, వార్డు ప్రజాపాలన సభల్లో అధికారులు వెల్లడిస్తున్నారు. సభలను ఈ నెల 24లోపు పూర్తి చేసి 26నుంచి అర్హులకు పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. భీమారం, చెన్నూరు మండలాల్లో వందశాతం గ్రామసభలు పూర్తయ్యాయి. జాబితాలో తమ పేర్లు లేవంటూ వందలాది దరఖాస్తులు అధికారులకు అందాయి. ప్రతీ సభలో పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ అర్జీలపైనా మరోమారు అర్హుల గుర్తింపు చేయాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులు సైతం మరోసారి ఆన్‌లైన్ నమోదు చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేశాకే అర్హులుగా ఉంటేనే పథకాలు వర్తింపజేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని గ్రామాల్లో 40వేల వరకు దరఖాస్తులు రాగా, వీటిని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ఇక పట్టణాల్లోని వార్డుల్లోనూ వేలాదిగా దరఖాస్తులు వస్తున్నాయి.

రేషన్‌కార్డులకే అధికం

గత రెండు రోజులుగా జరుగుతున్న గ్రామ, వార్డు సభల్లో రేషన్ కార్డుల కోసమే వినతులు అధికంగా వస్తున్నాయి. గత సర్కారులో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షించడంతో ప్రస్తుతం పెద్దయెత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ఆ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా కోసం వినతులు ఉంటున్నాయి. చాలాచోట్ల తమ పేర్లు అర్హుల జాబితాలో లేవంటూ నిరసనలకు దిగుతున్నారు. దీంతో అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటోంది. బెల్లంపల్లి, భీమారం, కోటపల్లి, భీమిని, జన్నారం తదితర మండలాల్లో ప్రజలు నిరసనలు తెలియజేశారు. ఇక కొన్ని చోట్ల మొక్కుబడిగా సభలు నిర్వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధికారులు సమాధానం ఇవ్వలేక సతమతం అవుతున్నారు. మరోవైపు గ్రామాల్లో అనర్హులను ఎంపిక చేశారంటూ విమర్శలు రావడంపై ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఇతర జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వస్తున్న అర్జీలపైనా వివరాలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా అర్హులు ఉండి జాబితాలో చోటు లేకపోతే దరఖాస్తులు తీసుకుని అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో సభల్లో గందరగోళం నెలకొంది.

ప్రజల్లో అసహనం

అర్హుల జాబితాపై ప్రజల్లో అసహనం నెలకొంటోంది. ఇప్పటికే ప్రజాపాలన, సామాజిక ఆర్థిక రాజకీయ కుల గుణన సమయంలోనూ వివరాలు వెల్లడించారు. మళ్లీ దరఖాస్తులు ఇవ్వాలంటూ కోరడంతో అసహనం నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు తీసుకోవడం, గతంలోనూ మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్‌లోనూ రేషన్‌కార్డుల కోసం పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఎన్నిసార్లు అర్జీలు ఇవ్వాలంటూ ప్రశ్నిస్తున్నారు. చాలామంది అనర్హులే ఉన్నారని, అన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించాకే తాజా జాబితా రూపొందించామంటూ అధికారులు చెబుతున్నారు.

భీమారంలో నిరసన

భీమారం: అనర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని మండల కేంద్రం భీమారంలో బుధవారం ప్రజాపాలన సభలో యువకులు నిరసన వ్యక్తం చేశారు. మళ్లీ సర్వే చేసే వరకు సభ వాయిదా వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను డిమాండ్ చేశారు. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సదానందం చెప్పడంతో యువకులు శాంతించారు. గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఎస్సై శ్వేత పార్టీల నాయకులకు బయటకు పంపించారు.

కార్మికుల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం

- ఆర్టీసీ సీఎంవో శైలజమూర్తి
- గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ప్రారంభం



ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న సీఎంవో శైలజమూర్తి

మంచిర్యాలఅర్బన్: ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్టీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్(తార్నాక ఆస్పత్రి సీఎంవో) శైలజమూర్తి తెలిపారు. మంచిర్యాలలో రెండ్రోజులపాటు నిర్వహించనున్న గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. కార్మికులు, కుటుంబ సభ్యులతో ఆరోగ్య పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. జాగ్రత్తలు, అవగాహన, వైద్య చికిత్సతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అన్నారు. సంస్థ కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు, చికిత్స అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆస్పత్రి తనిఖీ

కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్యం అందించే మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిని సీఎంవో శైలజమూర్తి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మందులపై ఆరా తీశారు. చికిత్స పొందే కార్మికులు, కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. డిపోలో గ్యారేజీ కార్మికులతో ముచ్చటించారు. ఆస్పత్రిని ఆధునీకరించి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచామని అన్నారు. కార్మికులు వివిధ ఆస్పత్రుల వైద్య పరీక్షల రిపోర్టులు సీఎంవో దృష్టికి తీసుకురాగా పరిశీలించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్, డిపో మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, వైద్యులు రామలశౌరి, సరయు, హెల్త్‌వాలంటరీలు ఉమా, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం వినతి

కార్మికులు అత్యవసర చికిత్స నిమిత్తం తార్నాక హైదరాబాద్‌కు వెళ్లకుండా ప్రతిమా ఆసుపత్రికి రెఫర్ చేసేలా చూడాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ బోర్డు సభ్యులు సత్తయ్య, మంగ సీఎంవోకు వినతిపత్రం అందజేశారు. తార్నకాకు రెఫర్ చేయడంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసరమైన మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేలాల జాతర వైభవంగా నిర్వహించాలి

- పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్: వేలాల మల్లన్న స్వామి జాతరను మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించాలని, అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని వేలాల మల్లన్న స్వామి ఆలయాన్ని బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ భాస్కర్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. గోదావరి తీరంలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించే ప్రాంతం, పార్కింగ్, గుట్టపైన దొణలో స్వయంభూగా వెలిసిన గట్టుమల్లన్న స్వామిని దర్శించుకున్నారు. జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 26న మహాశివరాత్రి జాతరకు భక్తులు వేల సంఖ్యల్లో హాజరవుతారని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. అనంతరం వేలాల గ్రామంలో గ్రామసభను పరిశీలించారు. అర్హుల జాబితాల్లో పేర్లు రానివారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఆలయ ఈవో రమేశ్, ఎస్సై శ్రీధర్, గట్టుమల్లన్న స్వామి వ్యవస్థాపకులు చొప్పకట్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటికి భూమిపూజ



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని అన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల సర్వే జాబితా ను అధికారులు ప్రకటిస్తున్నారని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని, ఆ జాబితాల్లో పేర్లు రాని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడమే బీజేపీ లక్ష్యం

- సీపీఐ జాతీయ సభ్యుడు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

పాతమంచిర్యాల: భారత రాజ్యాంగాన్ని మార్చడమే ఏకైక లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని సీపీఐ జాతీయ సభ్యుడు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామసుధ రెసిడెన్సీలో సీపీఐ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులరిజానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పని చేస్తోందని, హిందూయిజం, మతోన్మాదాలతో దేశాన్ని పాలించాలని చూస్తోందని ఆరోపించారు. కమ్యూనిస్టులను అభివృద్ధి నిరోధకులు అంటూ ప్రజలకు దూరం చేయాలని చూస్తోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సేవ ముసుగులో రాజకీయ పార్టీ కాదంటూ మతోన్మాదంతో ముందుకు వెళ్తోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మూలాలతో పని చేస్తున్న సంఘ్ పరివార్ శక్తులు ఏ పార్టీకి సంబంధం లేదంటూనే బీజేపీ వ్యతిరేక పార్టీలను నాశనం చేస్తోందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణకు దేశంలోని కమ్యూనిస్టులు, వామపక్ష పార్టీలు కలిసి ఒక్కటిగా ముందుకు నడవాలని తెలిపారు. కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు మేకల దాసు, ఖలిందర్‌ఖాన్, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ,చిప్ప నర్సయ్య, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, కారుకూరి నాగేష్, ఇప్పకాయల లింగయ్య, ముస్కె సమ్మయ్య, బాజీసైదా పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: అర్హులైన ప్రతి ఇంటా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పట్టణంలోని 22వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో వారు మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ కే.శ్రీనివాసరావు, మాజీ చైర్‌పర్సన్ మునిమంద స్వరూప పాల్గొన్నారు.

పేదలకు అందేలా కృషి

బెల్లంపల్లి: ప్రజా సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. బుధవారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 5909 మంది, రైతు భరోసాకు 51,534, రేషన్‌కార్డులకు 5,883, ఇందిరమ్మ ఇళ్లకు 39,517 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అర్హుల జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దని, గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ నాయకులు మునిమంద రమేష్, నాతరి స్వామి పాల్గొన్నారు.

మంచిర్యాలలో మహాప్రస్థానం

- వేగంగా కొనసాగుతున్న పనులు
- శివరాత్రికి ప్రారంభించేలా ఏర్పాట్లు
- గ్రీనరీ ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక
- సోలార్ సిస్టం ద్వారా విద్యుదుత్పత్తి
- అద్దె ఇళ్లల్లో ఉండేవారికి ఇది వరం



కొనసాగుతున్న బర్నింగ్ కేంద్ర నిర్మాణాలు



నిర్మాణ దశలో శివుని విగ్రహం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులకు మరో నెలరోజుల్లో చెక్ పడనుంది. సొంతిల్లు లేని వారు మరణిస్తే అద్దె ఇళ్ల వద్దకు మృతదేహాన్ని తెచ్చేందుకు చాలామంది యజమానులు నిరాకరిస్తున్నారు. కనీసం కర్మకాండలు నిర్వహించేందుకూ ఒప్పుకోవడం లేదు. దీంతో అద్దె ఇళ్లల్లో ఉండేవారు చివరి మజిలీకి పడుతున్న కష్టాలనేకం. సొంతిల్లు ఉన్నవారికీ కర్మకాండలు నిర్వహించేందుకు సరైన వసతులు లేవు. ఏటా వానాకాలంలో గోదావరి నది ఒడ్డున మృతదేహాలను ఖననం చేసేందుకు వరద అడ్డంకిగా మారుతోంది. మహాప్రస్థానం (వైకుంఠ ధామం) నిర్మాణంతో ఈ కష్టాలు తీరనున్నాయి. మహాప్రస్థానాన్ని అన్ని వసతులు, పూర్తి పచ్చదనం నిండి ఉండేలా నిర్మిస్తున్నారు.

సుమారు రూ.10కోట్లతో..

మంచిర్యాల పట్టణంలోని గోదావరి నదికి సమీపంలోనే నాలుగెకరాల భూదాన్ భూమిని మహాప్రస్థానం నిర్మాణానికి కేటాయించారు. రూ.4.42 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఇందులో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 కోట్లు కాగా, ఎఫ్‌డీఎఫ్ నుంచి రూ.42 లక్షలు కేటాయించారు. వీటితో చేపట్టే మహాప్రస్థానానికి నిధులు సరిపోకపోవడంతో, ఇతర నిధులు కలుపుకొని దాదాపు రూ.10 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం సివిల్ పనులు కొనసాగుతున్నాయి. శివుడి విగ్రహాన్ని భారీగా నిర్మిస్తున్నారు. ఆఖరి మజిలీలో ఎలాంటి కష్టాలు ఉండకూడదని, వచ్చిన వారందరికీ అన్ని సదుపాయాలు ఉండేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఎనిమిది బర్నింగ్ ప్లాట్‌ఫాంలు నిర్మిస్తున్నారు. కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు చూసేలా ఎదురుగా ప్రత్యేకంగా లాన్‌లు నిర్మిస్తున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా బాత్రూంలు, డ్రెస్సింగ్ రూంలు, కర్మకాండలు చేసుకునేందుకు గదులు, వంట చేసుకునే గదులతోపాటు అతిథి గదులు కడుతున్నారు.

పచ్చదనానికి పెద్దపీట

మహాప్రస్థానంలో సివిల్ పనులు పూర్తయిన తర్వాత హార్టికల్చర్ విభాగానికి సంబంధించిన పనులు చేపడతారు. పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నారు. సోలార్ ప్లేట్లు అమర్చి నిత్యం 20 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. కేశఖండనం చేసుకుని అక్కడే గోదావరి జలాలతో స్నానాలకు పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెల 26న మహాశివరాత్రి ఉండగా, అదేరోజు మహాప్రస్థానాన్ని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి 20లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

రాష్ట్రంలోనే మోడల్‌గా..



రాష్ట్రంలోనే ఎక్కడా లేనట్లు మంచిర్యాలలో మహాప్రస్థానం నిర్మిస్తున్నాం. నాలుగెకరాల్లో రూ.4.42 కోట్లతో పనులు ప్రారంభించాం. సుమారు రూ.10కోట్ల వరకు ఖర్చు చేస్తాం. సొంతిల్లు లేని వారు కర్మకాండలు చేసుకునేలా అన్ని వసతులు కల్పిస్తున్నాం. ప్రత్యేక గదులు, క్షౌరశాల, స్టోర్ రూం, షవర్‌బాత్‌లు నిర్మిస్తున్నాం. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం. ఇది రాష్ట్రానికే మోడల్‌లా ఉంటుంది.

– కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి 200మందికి సెల్‌ఫోన్లను రామగుండం సీపీ శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 5,280 మంది ఫిర్యాదు చేయగా.. 200 సెల్‌ఫోన్లను గుర్తించామని తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీకి సీసీఎస్‌తో పాటు ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని అన్నారు. మొబైల్‌ను పోగొట్టుకున్న వారు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఎస్ సీఐ కమలాకర్, ఐటీసెల్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీంలపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలక్రైం: మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్ హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాల వంటి వాటిపైన పెట్టుబడులు పెట్టి అధిక మొత్తంలో లాభాలు గడించవచ్చని నమ్మించి ప్రజల డబ్బులు దోచేస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని భావిస్తే తక్షణమే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

సీఆర్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వినంత్‌రావు



వినంత్‌రావు

ఇచ్చోడ: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇచ్చోడ మండలానికి చెందిన జాదవ్ వినంత్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలో సీఆర్టీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

యువకుడి రిమాండ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. బోథ్‌కు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. యువకుడి బంధువులైన మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

బిజ్జూర్: అటవీ జంతువును వేటాడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ అజ్మీరా మోహన్ నాయక్ తెలిపారు. మండలంలోని ముంజంపల్లికి చెందిన తుమ్మిడే శంకర్, బాలేపల్లి రాకేష్ మంగళవారం అటవీ జంతువులను వేటాడే డబ్బా (మీటు) ద్వారా నీలుగాయిని హతమార్చారనే పక్కా సమాచారం మేరకు రాత్రి ఇంట్లో సోదాలు నిర్వహించగా వండిన అటవీ జంతువు మాంసం లభ్యమైంది. దీంతో వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

నర్సాపూర్(జి): ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయి కిరణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై నిర్మల్ నుండి భైంసా వెళ్తున్న ఆర్టీసీ బస్సును భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న దిలావర్‌పూర్ గ్రామ వాసి నర్సమ్మకు గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఎస్టీపీపీ కార్మికుడికి గాయాలు

జైపూర్: కారు ఢీకొట్టిన ఘటనలో ఎస్టీపీపీ కార్మికుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న గూడూరి అజయ్ విధుల్లో భాగంగా ఉదయం పవర్ ప్లాంటుకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయంలో బైక్‌పై బయటికి వస్తుండగా ఎస్టీపీపీలో ఎస్సీ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి అధికారి ప్రసాద్ తన కారులో బయటకు వస్తుండగా గెస్ట్‌హౌజ్ క్రాస్ వద్ద బైక్ను ఢీకొట్టాడు. ఘటనలో అజయ్‌కు గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పక్షుల లెక్క పక్కా

- 'కవ్వాల్'లో పక్షుల సర్వే
- ఏడు బృందాలు.. 28 మంది సభ్యులు
- ఈ నెల 24 నుంచి మూడురోజుల పాటు గణన





కవ్వాల్ టైగర్‌జోన్‌లోని పక్షులు



జన్నారం(ఖానాపూర్): పక్షుల లెక్కకు వేళయింది. మనుషులు, వన్యప్రాణుల వలే పక్షుల లెక్కను పక్కాగా చేయాలని అటవీశాఖ అధికారులు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షి గణన(సర్వే)కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని 3 అటవీ రేంజ్‌లు, 14 అటవీ సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లలో ఈ గణన కొనసాగనుంది. డివిజన్ పరిధిలోని పక్షులు, అందులో విదేశీ పక్షులు, స్వదేశీ పక్షులు, వలస పక్షులు, తదితర విషయాలను లెక్కించనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి సర్వే ప్రారంభించనుండగా 26వ తేదీ వరకు గణన కొనసాగనుంది. అయితే ముందుగా డివిజన్‌లో పూర్తి చేసి ఆతర్వాత కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అన్ని అటవీ రేంజ్‌లలో ఈ గణన చేపట్టనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పూర్వకాలం నుంచే గణన

పూర్వకాలం నుంచే పక్షుల లెక్కింపు జరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 1930లో హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో సలీం అలీ అనే పక్షి ప్రేమికుడు పక్షి గణన చేశారు. ఆ సమయంలో కవ్వాల్ అభయారణ్యంలోని దట్టమైన అడవుల్లో పర్యటించి పక్షులను లెక్కించినట్లు చెబుతున్నారు. అనంతరం 2005, 2020లో పక్షి గణన జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం జరుగనున్న గణన ప్రపంచంలో ఎవ్వరైనా చూసుకునే విధంగా ×ఈ బర్డ్*' అనే యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. గణన సమయంలో పక్షుల ఫొటోలు, రకాలు, వాటి శాస్త్రీయ నామం, తదితర అంశాలను జత చేయడం వల్ల పక్షులను గుర్తించే అవకాశం ఉంది.

ఏడు టీంలు 28 మంది సభ్యులు

28 మంది వ్యక్తులను ఏడు టీంలుగా విభజించి పక్షి గణన చేయనున్నారు. డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ సభ్యు ల సహకారం తీసుకోనున్నారు. ఒక్కోటీంలో న లుగురు సభ్యులు ఉంటారు. బర్డ్ ఎక్స్‌పర్ట్ (పక్షి నిపుణుడు), ఒక వలంటీర్, సంబంధిత బీట్, లే దా సెక్షన్ అధికారి, ఒక బేస్‌క్యాంపు సిబ్బంది కలి సి ఒక టీంగా ఏర్పడి గణన చేయనున్నారు. ఒక్కోటీం సభ్యులు ఒక్కో బీట్ పరిధిలో పర్యటిస్తూ పక్షులను గుర్తిస్తారు.

రోజుకు రెండు బీట్లు

పక్షి గణన చేసే సభ్యులు ఒక్కో టీం రోజుకు రెండు బీట్‌లు పూర్తి చేస్తారు. ఉదయం 6:30 గంటలకు గణన ప్రారంభించి 10 గంటలకు ఒక్క బీట్ పూర్తి చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు అదే టీం మారో బీట్‌లో సర్వే చేస్తారు. బీట్ మారినప్పుడు బీట్ అధికారి, బేస్‌క్యాంపు సిబ్బంది మారుతారు. మిగతా వారు అలాగే ఉంటారు. ఇలా ప్రతీరోజు ఒక్కో టీం రెండు బీట్‌లలో సర్వే చేస్తారు. రోజుకు 14 బీట్‌లలో సర్వే చేసి మూడు రోజుల్లో డివిజన్‌లోని 40 బీట్‌లను పూర్తి చేస్తారని అధికారులు తెలిపారు. బీట్ పరిధిలో పక్షుల ఆవాసాల వద్ద, దట్టమైన చెట్ల పొదలు, నీటి కుంటలు తదితర ప్రదేశాల్లో పర్యటిస్తారు. ప్రతీ బీట్‌లో మూడు కిలోమీటర్ల దూరం వరకు తిరిగి పక్షులను గుర్తిస్తారు.

ఫిబ్రవరిలో వివరాలు విడుదల

పక్షుల సర్వేలో భాగంగా రోజువారి వివరాలను సేకరించిన టీం సభ్యులు చివరి రోజు అన్నీ కలిపి ఏరకం పక్షులు ఎన్ని ఉన్నాయని లెక్కిస్తారు. అటవీశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పూర్తి పక్షుల వివరాలను వెల్లడిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి మాసంలో వివరిస్తామని అట వీశాఖ అధికారులు తెలిపారు. అయితే 'ఈ బర్డ్' యాప్‌లో జన్నారం అటవీ డివిజన్ పేరున ప్రత్యేక వెబ్‌సెట్ రూపొందించి అందులో పక్షుల వివరాలు పొందుపర్చనున్నట్లు తెలిపారు. దీంతో డివిజన్‌లో ఎన్ని రకాలు, ఏఏ రకాల పక్షులు ఉన్నాయని ప్రపంచ వ్యాప్తంగా తెలుస్తుందన్నారు. డివిజన్‌లో వలస పక్షులు, విదేశీ, స్వదేశీ పక్షులు, అంతరిస్తున్న పక్షులు, ఇక్కడికి చేరిన కొత్తరకం పక్షుల వివరాలు తెలుస్తాయన్నారు.

పక్షుల వివరాలు తెలిపేందుకే..



కవ్వాల్ టైగర్‌జోన్‌లో వన్యప్రాణులతో పాటు పక్షులు కూడా ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్‌లో అనేక రకాల పక్షులను గుర్తించాం. జన్నారం అటవీ డివిజన్‌లో అంతరిస్తున్న పక్షులు, వలస పక్షులు, విదేశీ, స్వదేశీ పక్షులు, వాటి విశేషాలను గుర్తించి ప్రపంచానికి తెలియజేయడానికి సర్వే నిర్వహిస్తున్నాం. మూడు రోజుల్లో సర్వే పూర్తిచేస్తాం. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరుస్తాం. – శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

వసంత పంచమి వేడుకలపై సమీక్ష



మాట్లాడుతున్న అధికారులు

బాసర: కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం ఫిబ్రవరి 1నుంచి 3వరకు నిర్వహించనున్న వసంత పంచమి వేడుకలపై ఆర్డీవో కోమల్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎస్సై గణేశ్, ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడు అరెస్టయ్యాడని రూ.30 వేలు స్వాహా

ఆదిలాబాద్: తమ్ముడు అరెస్ట్ అయ్యాడని అన్నను మోసగించి రూ.30 వేలు స్వాహా చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన అఫ్రోజ్‌ఖాన్‌కు ఈ నెల 16న అతని తమ్ముడు ఒక కేసులో అరెస్టయ్యాడని ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. విడుదల చేయాలంటే వెంటనే రూ.60 వేలు పంపించాలని డిమాండ్ చేశాడు. ఆందోళన చెందిన అఫ్రోజ్ ఖాన్ అతనికి రూ.30 వేలు నగదు బదిలీ చేశాడు. అయితే తమ్ముడు అరెస్టు కాలేదని, క్షేమంగానే ఉన్నాడని తెలుసుకోవడంతో మోసపోయానని గ్రహించి బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కలప స్మగ్లింగ్ నిందితుల అరెస్ట్



పట్టుకున్న వాహనం, నిందితులతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఖానాపూర్, ఎక్బాల్‌పూర్ అటవీ బీట్‌లలో ప్రధాన రహదారి పక్కనే గత నెల 19న కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన పలువురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్ తెలిపారు. ఖానాపూర్ మండలంలోని ప్రధాన రహదారి పక్కన అధునాతన యంత్రంతో భారీ వృక్షాలను పడగొట్టి రూ.25 లక్షల విలువైన కలప తరలించిన 12 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కలప స్మగ్లింగ్ కోసం నిందితులు మూడు కార్లతో పాటు పవర్ షా అనే కలప కోత యంత్రాన్ని వినియోగించగా ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల గత నేర చరిత్ర ఆధారంగా ఆయా చోట్ల గల పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా సైతం ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

కలప స్మగ్లింగ్‌లో పాల్గొన్న కడెం మండలం దోస్తునగర్‌కు చెందిన జి.నాగేశ్, మైసంపేట్‌కు చెందిన డి.శ్రీనివాస్, మంచిర్యాలకు చెందిన ఎం.రాజ్ గోపాల్‌తో పాటు డూప్లికేట్ నంబర్ ప్లేట్‌తో ఉన్న ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. కడెం మండలం కల్లెడ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు ఏ.శేఖర్‌తో పాటు జన్నారం మండలం టీజీపల్లెకు చెందిన సంజీవ్, సతీశ్, తదితరులను పట్టుకోవాల్సి ఉందన్నారు. కలపను మంచిర్యాలకు చెందిన జగదీశ్వర్‌తో పాటు కరీంనగర్‌కు చెందిన మహేందర్‌రెడ్డికి విక్రయించగా ఇరువురిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కలప స్మగ్లింగ్ కేసు విషయమై విచారణ నిమిత్తం కరీంనగర్ వెళ్లివస్తున్న అటవీ అధికారుల వాహనాన్ని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దోనూర్ వద్ద ఛేజింగ్ చేసిన స్మగ్లర్లు బ్రీజా వాహనంతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై డయల్ 100కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవోలు నరేందర్, ముత్యం, రాంచందర్, మోహిద్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



పాక్షికంగా దెబ్బతిన్న యంత్రాలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లులో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగింది. రబ్బరు పట్టాలపై వెళ్తున్న పత్తికి రబ్బరు పట్టా రాపిడికి గురై యంత్రాల్లో ఉన్న పత్తికి నిప్పంటుకుని దట్టమైన పొగలు వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది అత్యవసర అగ్నినివారణ పైప్‌లైన్ల ద్వారా మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఆదిలాబాద్ నుంచి వచ్చిన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జైయంత్‌రావ్ పర్యవేక్షణలో సిబ్బంది పూర్తిగా మంటలను ఆర్పివేశారు. యంత్రాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, సీసీఐకి చెందిన సుమారు 3 క్వింటాళ్ల పత్తి దెబ్బతిన్నట్లు జిన్నింగ్ యజమాని వినోద్ సేట్, సీసీఐ పత్తి కొనుగోలు అధికారి గణేశ్ తెలిపారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో గల దర్శన్ జిన్నింగ్ మిల్లులో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పి వేయడంతో ఆస్తి నష్టం జరగలేదన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీగల్‌పహాడ్‌లో దుర్గం వెంకటేశ్వర్లును కులం పేరుతో దూషించిన కందుల ప్రశాంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న వెంకటేశ్వర్లు ఇంటి పక్కన ఉండే జాలి శ్రావణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం ల్యాప్‌టాప్ తీసుకుని తిరిగి ఇచ్చింది. అదేరోజు మధ్యాహ్నం వెంకటేశ్వర్లు తన మిత్రులతో కలిసి ఇంట్లో ఉండగా కందుల ప్రశాంత్ ఇంట్లోకి ప్రవేశించి ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్ ఇవ్వు, లేకపోతే చంపుతానని బెదిరిస్తూ కులంపేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎ స్సై సుగుణాకర్ ఈనెల 20న ప్రశాంత్‌పై కేసు న మోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడకు చెందిన ఎంఏ రహీమ్ కుమార్తె ఉజ్మఅంజుమ్ (24)కు మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి సాజిద్ హుస్సేన్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలకు కొంతకాలంగా గొడవ నడుస్తోంది. కుమారుడు తనకు పుట్టలేదని సాజిద్ తరచూ భార్యను వేధించేవాడు. ఆమె అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రికి తీసుకెళ్లమని భర్తను కోరగా.. 'నేను తీసుకెళ్లను.. చచ్చిపో' అని అనడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. తమ కుమార్తె మృతికి కారణమైన సాజిద్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి రహీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చుక్కలదుప్పి మాంసంతో దొరికిన వ్యక్తి అరెస్టు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమాపతికుంటలో చుక్కలదుప్పి మాంసంతో దొరికిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు బీర్సాయిపేట్ అటవీ రేంజ్ అధికారి అరుణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఉమాపతి కుంటకు వెళ్లి గ్రామానికి చెందిన తొడసం చిన్ను పంట చేనుకు వెళ్లారు. అక్కడ చిన్ను మాంసం ముక్కలు ఆరబెడుతూ కనిపించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సీతారాం, బీట్ అధికారులు రాంకుమార్, కోసేరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఈజ్‌గాం పోలీసులు తెలిపారు. రాస్పెల్లి గ్రామానికి చెందిన ఇనుముల శశికాంత్ (22) బైక్‌పై కాగజ్‌నగర్ నుంచి రాస్పెల్లికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో గొంతు కోసుకున్న యువకుడు



ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో బుధవారం ఓ యువకుడు బ్లేడుతో గొంతు, చేయి కోసుకుని హల్‌చల్ చేశాడు. యువకుడి గొంతు, చేతి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ మురళి, పైలట్ రమేశ్ ప్రథమ చికిత్స చేసి ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడు ఉట్నూర్ సుభాష్‌నగర్‌కు చెందిన కుడిమేత వరుణ్ అని సిబ్బంది తెలిపారు. ఖానాపూర్ సీఐ సైదారావు ఉడుంపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ ఘటన నకు సంబంధించి కారణాలు తెలియాల్సిఉంది.

కోతులకు ఆహారం వేసిన ఇరువురికి జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాతమంచిర్యాల అటవీ సెక్షన్‌లో గల తిమ్మాపూర్ బీట్ అడవిలో రోడ్డు పక్కన ఉన్న కోతులకు ఆహారం వేస్తున్న ఇరువురికి బుధవారం అటవీ అధికారులు జరిమానా విధించారు. మంచిర్యాలలోని హమాలీవాడకు చెందిన మిరియాల శివ, గడ్డం జగన్ కోతులకు ఆహారం వేస్తుండగా అటవీశాఖ అధికారులు వారిని ఆపి కోతులకు ఆహారం వేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు రూ.4 వేల జరిమానా విధించినట్లు ఎఫ్ఎస్‌వో అతావుల్లా, ఎఫ్‌బీఓలు సంతోశ్, రాజేందర్ తెలిపారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసులో ఒకరిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనికి చెందిన కుటుంబ సభ్యులు బాలిక అదృశ్యమైనట్లు ఈ నెల 20న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా తలమడుగు మండలానికి చెందిన పవన్ కుమార్ బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్న వయస్సులోనే పెద్ద సాయం

- సంరోహ స్వచ్ఛంద సంస్థ పేరిట సామాజిక సేవ
- కొలాంగూడను దత్తత తీసుకున్న సుజయ్‌రెడ్డి



అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న సుజయ్‌రెడ్డి

ఇచ్చోడ: చిన్న వయస్సులోనే పెద్ద మనసుతో సామాజిక సేవ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన సురకంటి సుజయ్‌రెడ్డి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్న సుజయ్‌రెడ్డి తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సంరోహ స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. ఇంటర్ చదువుతూనే ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని కొలాంగూడను దత్తత తీసుకున్నాడు. చిన్నారుల్లో పోషకాహారలోపం, పెద్దల్లో నిరక్షరాస్యతను గుర్తించాడు. న్యూట్రిషన్ ప్రాజెక్టు ద్వారా 38 మంది చిన్నారులకు రెండేళ్లుగా రోజుకు ప్రతీ ఒక్కరికి 200 మిల్లీలీటర్ల పాలతో పాటు సరిపడా ఆకుకూరలు అందజేస్తున్నాడు. వారికి మెరుగైన ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన ప్రతీసారి మారుమూల గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ గిరిజన ఆదివాసీ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నాడు. పెద్దల్లో నిరక్షరాస్యతను గుర్తించి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ తనవంతు కృషి చేస్తున్నాడు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కొలాంగూడలో నివాసముంటున్న చిన్నారుల తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో వారికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నాడు. ప్రతీ ఒక్కరికి వివిధ బ్యాంకులలో సేవింగ్ ఖాతాలు తెరిపించాడు. వ్యవసాయం లేదా వ్యవసాయేతర పనుల ద్వార వచ్చిన దాంట్లో కొంత డబ్బును బ్యాంక్‌లో జమ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పిస్తున్నాడు. ప్రతీ కుటుంబాన్ని ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేయిస్తున్నాడు.

భార్యాభర్తల పంచాయితీలో గొడవ

- రోడ్డు వెంట పరుగెత్తుకుంటూ ఇరువర్గాల దాడులు
- పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీసిన బాధితులు



దాడికి పాల్పడుతున్న ఇరువర్గాలు

దండేపల్లి: దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు కొద్దిదూరంలోనే సహకార సంఘం కార్యాలయ భవనం సమీపంలో బుధవారం భార్యాభర్తల (వెల్గనూర్‌కు చెందిన భార్య, ధర్మపురి మండలం దోనూర్‌కు చెందిన భర్త) పంచాయితీ జరిగింది. వివాదం తలెత్తడంతో ఇరువర్గాలకు చెందినవారు దాడులకు పాల్పడ్డారు. పంచాయితీ పెద్దలు చర్చించుకుని బయటకు వచ్చేక్రమంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి పంచాయితీ పెద్దలు, బంధువులు ఎవరు దొరికితే వారిని ఇష్టారీతిన సినిమా స్టైల్‌లో కొట్టారు. దీంతో వారంతా రక్షణ కోసం సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా పంచాయితీలో గొడవ జరిగింది వాస్తవమేనని, ఇందులో నలుగురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించామన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు

కెరమెరి: గంజాయి సాగుచేస్తూ విక్రయిస్తున్న నలుగురికి కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 21 సెప్టెంబర్ 2021న అప్పటి ఎస్సై రమేశ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గోయగాం నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తుల వద్ద కిలో గంజాయి కలిగిన ఒక బ్యాగు లభించింది. కదవండి ప్రవీణ్, గొండ ప్రణయ్, చౌదరి మణికంఠ గంజాయిని మొహర్లే మధుకర్‌కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. మధుకర్‌ను విచారించగా ఇంట్లో రెండు కిలోల గంజాయి, వ్యవసాయ క్షేత్రంలో గంజాయి మొక్కలు లభించాయి. సీఐ సుధాకర్ కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఏడాది జైలు, రూ.పదివేల జరిమానా, మధుకర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై వివరించారు.

రూ.74 లక్షల విలువైన గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన సుమారు రూ.74 లక్షల విలువైన 117.8 కిలోల గంజాయిని బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని వెంకటరమణ ఇన్సినిరేటర్స్ సెంటర్ వద్ద దహనం చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 53 కేసుల్లో నిల్వ ఉన్న గంజాయిని పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు చేస్తూ, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.